క్లుప్తంగా

ఉపాధ్యాయులు తల్లిదండ్రుల పాత్ర పోషించాలి

ప్రముఖ కవి అందెశ్రీ



పాఠశాలలో అందెశ్రీతో గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర పోషించాలని ప్రముఖ కవి అందెశ్రీ అన్నారు. శనివారం తన స్వగ్రామం మద్దూరు మండల పరిధి రేబర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. గతంలో పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించానని, ఈసారి కూడా అందిస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎందరో మహానుభావులు నేడు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతారని, అందువలన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ కార్పొరేషన్‌ను పరిశ్రమల శాఖగా మార్చాలి



మాట్లాడుతున్న సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

హుస్నాబాద్: విశ్వకర్మ కార్పొరేషన్‌ను పరిశ్రమల శాఖగా మార్చాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో శనివారం సంఘం ఏడు మండలాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వకర్మలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీనిని పరిశ్రమల శాఖగా మార్చి విశ్వకర్మ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసి తెలంగాణ జాతిపితగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సుదర్శనాచారి, సంఘ నాయకులు ఉప్పుల శ్రీనివాస్, కుమారస్వామి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకోవాలి

శాంతి సమావేశంలో ఏసీపీ సతీశ్



మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్

చేర్యాల(సిద్దిపేట): ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని ముస్లిం మతపెద్దలకు హుస్నాబాద్ ఏసీపీ సతీష్ సూచించారు. బక్రీద్ సందర్భంగా శనివారం సీఐ కార్యాలయంలో చేర్యాల పట్టణ ముస్లిం, తంజుమ్ కమిటీ పెద్దలతో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు శాంతియుతంగా బక్రీద్ పండగను జరుపుకోవాలన్నారు. హిందువులు, ముస్లింలు పరస్పరం సహకరించుకుంటూ పండుగలు జరుపుకోవాలన్నారు. సమావేశంలో తంజుమ్, ముస్లిం పెద్దలు, సీఐ శ్రీను, ఎస్ఐ దామోదర్ పాల్గొన్నారు.

డబ్బు జమచేయడం హర్షణీయం



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్ పామ్ గెలలను ఫ్యాక్టరీకి తరలించిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం హర్షణీయమని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పంట సాగు చేసిన రైతులు నాగేంద్ర, కృష్ణారెడ్డితో కలసి శనివారం నంగునూరులో విలేకరులతో మాట్లాడారు. ఆయిల్ పామ్ గెలలను అశ్వారావుపేటలోని ఫ్యాక్టరీకి తరలించిన మూడు రోజుల్లో డబ్బులు అందాయన్నారు. మంచి లాభాలు వచ్చే పంటను వేయాలని ప్రోత్సహించిన ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు.

అమ్మ ఆదర్శాలకు తిలోదకాలు?

ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సర్కార్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. పాఠశాలల అభివృద్ధితో పాటు పనులు చేయించే బాధ్యతలను కమిటీలకు అప్పగించింది. రూ.లక్ష వరకు మరమ్మతులు చేయించేందుకు మండల అధికారుల ఆమోదంతో చేయించుకునే వెసులుబాటు కల్పించారు. అయితే ఒకే గుత్తేదారుకు పనులు అప్పగించడంతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచినట్లయ్యింది.

- పాఠశాలల మరమ్మతులు పక్కదారి
- 15 పాఠశాలల పనులు ఒకే గుత్తేదారుకు అప్పగింత
- కమిటీలను పక్కన పెట్టిన గురువులు
- పనుల్లో కొరవడిన నాణ్యత



పందిల్లలో విరిగిన పాఠశాల తలుపు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలంలో 28 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 27 పాఠశాలల్లో 93 పనులను అధికారులు గుర్తించారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి మరమ్మతులు పూర్తిచేసి తరగతి గదులను సిద్ధం చేయాలని జిల్లా అధికారులు ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు చైర్మన్‌గా, హెచ్‌ఎం కన్వీనర్‌గా, పాఠశాలలో చదువుకునే పిల్లల తల్లులను కమిటీలో సభ్యులుగా తీసుకుంటారు. రూ.50 నుంచి రూ.లక్ష లోపు పనులు స్వయంగా కమిటీ సభ్యులే చేయిస్తే త్వరగా పూర్తి చేయడంతో పాటు మన ఊరు బడిని నాణ్యతతో నిర్మించుకోవాలనే బాధ్యత వారిపై ఉంటుందని ప్రభుత్వ ఆలోచనతో కమిటీలకు పనుల బాధ్యతలను అప్పగించింది.

ఎక్కువ పనులన్నీ..

మండలంలోని 17 గ్రామాలు ఉంటే అందులో 15 గ్రామాల పనులను ఒకే గుత్తేదారుకు అప్పగించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మా ఊరు బడిలో పనులను తాము చేసుకుంటే పైసా ఎక్కువైనా భరించేవాళ్లమని కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో ఇప్పటి వరకు పూర్తి చేయలేదని పందిల్ల గ్రామస్తులు చెబుతున్నారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి పూర్తి చేయకపోవడంతో పాఠశాలలకు పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు ఇష్టపటం లేదు. పనులు చేయించేందుకు ముందుస్తుగా 25 శాతం డబ్బు కమిటీ ఆధ్వర్యంలో బ్యాంకిల నుంచి విత్‌డ్రా చేయించారు. ఉచిత పుస్తకాలు, దుస్తులు ఇచ్చినప్పటికీ వసతులు లేక పాఠశాలలకు తమ పిల్లలను పంపించేందుకు వెనకడుగు వేస్తున్నారని బడిబాటలో గ్రామస్తులు తెలిపారు. బదిలీలు, పదోన్నతులతో తాము వెళ్లిపోతామని ఉపాధ్యాయులు పనుల గురించి పట్టించుకోవడం లేదు.

విరిగిన కిటికీలు, తలుపులు

గ్రామీణ పాఠశాలలు అధ్వానంగా ఉన్నాయి. ఉపాధ్యాయులు పాఠశాలల నిర్వహణ విస్మరిస్తున్నారు. విరిగిన కిటికీలు, తలుపులు, అసంపూర్తి మూత్రశాలలు దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అవగాహన కల్పించి చైతన్యపరిస్తే తప్ప ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చెందవు.



విరిగిన బాత్‌రూమ్ తలుపు రేకు

20 లోపు పనులు చేయిస్తాం

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలోనే పనులు చేయిస్తున్నాం. వాళ్లు చేయని పనులు మరొకరికి అప్పగించి పూర్తి చేయిస్తాం. ఈనెల 20 లోపు 27 పాఠశాలల్లో పనులు పూర్తిచేసి హెచ్‌ఎంలకు అప్పగిస్తాం. పనులు చేయడానికి 25 శాతం నిధులు అడ్వాన్స్‌గా తీసుకోవచ్చు. కొన్ని పాఠశాలల హెచ్‌ఎంలు ముందుగానే డబ్బులు ఇచ్చి ఉండవచ్చు.

– సాయిప్రణీత్, ఏఈ, మున్సిపల్

గజ్వేల్ ఎమ్మెల్యే కనబడుట లేదు



వాల్‌పోస్టర్‌ను అతికిస్తున్న బీజేపీ నాయకులు

- వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీల ఏర్పాటు చేసిన బీజేపీ నేతలు
- పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కనబడటం లేదని బీజేపీ నేతలు పోలీస్‌స్టేసన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే మినీ క్యాంపు కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం ప్రధాన చౌరస్తాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ వ్యవహారం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా బీజేపీ నేత బండారు మహేశ్ మాట్లాడుతూ పదేళ్ల సీఎంగా ఉన్న కేసీఆర్ తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌కు చేసిందేమి లేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా గృహ ప్రవేశాలు చేయించలేదన్నారు. ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించలేని కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ గజ్వేల్ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

హుస్నాబాద్‌రూరల్: పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ లకావత్ మానస అన్నారు. శనివారం నాగారం, మహ్మదాపూర్, గాంధీనగర్, పోతారం(ఎస్), మీర్జాపూర్ గ్రామాల్లో కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ఆలస్యమైందన్నారు. మండలంలో మొత్తం 129 మందికి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీనివాస్, పిట్టల శ్రావణి, మాజీ సర్పంచ్‌లు బొంగొని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాభవన్‌లో వంటావార్పు



వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన నాయకులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని బంజారా భవన్‌లో శనివారం గిరిజన సంఘాల ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. గుట్టపై ఉన్న బంజారా భవన్‌కు రోడ్డు నిర్మించి, అక్రమంగా నిర్మించిన ఇళ్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేనియెడల గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలకు నిరసనగా పది రోజుల పాటు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. త్వరగా రోడ్డు నిర్మించే దిశగా మంత్రి పొన్నం ప్రభాకర్ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సత్యం నాయక్, గిరిజన అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షుడు వీరన్న నాయక్, నాయకులు చంద్రు నాయక్, శ్రీనివాస్ నాయక్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వలమైన భవిష్యత్

- ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్

గజ్వేల్‌రూరల్: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని ఉన్నత విద్యాశాఖ జేడీ (జాయింట్ డైరెక్టర్) ప్రొఫెసర్ డి.రాజేందర్ సింగ్ పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దోస్త్ ప్రక్రియ ద్వారా అడ్మిషన్లు పొంది, ఇష్టమైన కోర్సును ఎంచుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో తిరిగి కోఎడ్యుకేషన్ ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారులు దీపక్‌కుమార్, ముఖేష్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు డాక్టర్ రమేష్‌బాబు, బాలరాజు, విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రం, పెద్దిరాజు, కవిత, లక్ష్మీనర్సయ్య, మార్కండేయ, ఓంప్రకాష్, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్

విద్యార్థులకు ఆర్థిక సహాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని పేద పద్మశాలి విద్యార్థులకు జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీష్ శనివారం తెలిపారు. 2023–24లో పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన వారికి ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. అర్హత గలవారు ఈనెల 30 లోగా పట్టణంలోని రోహిణీ మెటర్నిటీ నర్సింగ్ హోం (9848134401)లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ మారుతి తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తాకుతున్న కారణంగా వాటిని తొలగించే పనులు చేపట్టామన్నారు. దీంతో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు.

నులిపురుగుల నివారణలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా

మిరుదొడ్డి(దుబ్బాక): నులిపురుగుల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలని మిరుదొడ్డి పీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా అన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించే నులిపురుగుల నివారణ కార్యక్రమాలపై పీహెచ్‌సీలో శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19 ఏళ్ల లోపువారిని గుర్తించి వారికి అల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మిలింగం, తహసీల్దార్ గోవర్ధన్, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, సీహెచ్‌ఓ లింగమూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు లింగం, ధర్మారం మల్లయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. శనివారం సిద్దిపేటలోని బీజేఆర్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా సమీక్షా సమావేశానికి హాజరై మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాల్లో ధర్మ సమాజ్ పార్టీని బలోపేతం చేస్తామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉంటున్న ఏకైక పార్టీ డాక్టర్ విశారదన్ మహారాజ్ నాయకత్వంలోని ధర్మ సమాజ్ పార్టీ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు జ్యోతి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్

అట్రాసిటీ కేసుపై విచారణ



వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ సతీష్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై శనివారం హుస్నాబాద్ ఏసీపీ సతీష్ రసులాబాద్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఈనెల 14వ తేదీన రసులాబాద్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల వెంకటేశం, ప్రవీణ్, ప్రశాంత్ మధ్య కోడిఎరువు కిరాయి విషయంలో గొడవ జరిగిది. దీంతో ఎర్రోళ్ల వెంకటేశంపై ప్రవీణ్, ప్రశాంత్ దాడిచేసి కులం పేరుతో దూషించారని ఎర్రోళ్ల వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. దీనిపై ఏసీపీ గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఏమైన తగాదాలు పెద్దమనుషుల సమక్షంలో గ్రామంలోనే పరిష్కరించుకోవాలన్నారు. లేదంటే పోలీస్ స్టేషన్‌కు వస్తే ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి సమస్య పరిష్కరయ్యేవిధంగా చూస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూ సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎల్లయ్య

గజ్వేల్‌రూరల్: ధరణిలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని ఐఓసీలో ఆర్డీఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధరణి వచ్చిన తర్వాత భూ రికార్డుల్లో తప్పులు దొర్లాయని, దీంతో పట్టాదారు పేరున కాకుండా ఇతరుల పేర్లపై నమోదయ్యాయన్నారు. దీంతో సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరుగుతూ మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ధరణి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, అహ్మద్, నర్సింహులు, రాజు, వెంకట రాముడు, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

జగదేవపూర్(గజ్వేల్): జగదేవపూర్ మండలం జంగం రెడ్డిపల్లి శ్రీకోదండరామ స్వామి ఆలయం (రామునిబండ) వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శనివారం సాయంత్రం బ్రహ్మోత్సవాలకు వేదపండితులు అంకురార్పణ చేశారు. నాలుగు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని ఆలయ పండితులు తెలిపారు. శనివారం విశ్వక్సేన ఆరాధన, దీక్షధారణ, ఆదివారం అగ్ని ప్రతిష్ఠ, వైనతేయ ఇష్టి దేవత్వాహనం, లక్ష్మీ హవనం, సోమవారం సుదర్శన హోమం, స్వామివారి కల్యాణం, రామతారకాస్త్ర మహామంత్ర హవనం, పురవీధుల్లో పల్లకీసేవ, మంగళవారం మహాపూర్ణాహుతి, నవకలశ స్నపనము, చక్రస్నానం, దేవతోద్వాసన, పుష్పయోగం, మహదాశీర్వచనం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.



ముస్తాబైన రామునిబండ ఆలయం

సంక్షిప్త వార్తలు

◆ దాడి హేయమైన చర్య

చిన్నకోడూరు(సిద్దిపేట): బీజేపీ సోషల్ మీడియా సిద్దిపేట జిల్లా కన్వీనర్ ముచ్చర్ల నాగరాజుపై దాడి చేయడం హేయమైన చర్య అని పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ అన్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల విజయోత్సవ సంబురాలు జరుపుకుంటున్న సమయంలో కొందరు నాగరాజుపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న వెంకటరమణ శనివారం మండల పరిధి ఒబులాపూర్‌లో బాధితుడిని పరామర్శించారు. దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడుల సంస్కృతి మానుకోవాలన్నారు.

◆ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి

సిద్దిపేటకమాన్: విద్యార్థుల సమస్యలను డీఈఓ, సంబంధిత అధికారులకు దృష్టికి విద్యార్థి సంఘాల నాయకులు తీసుకెళ్లాలని సిద్దిపేట సీపీ అనురాధ శనివారం సూచించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని బలవంతంగా స్కూల్స్ బంద్ చేయించకూడదన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళితే వారు పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తారన్నారు. స్కూల్స్ ముందు ధర్నాలు, రాస్తారోకోలు చేసి విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ శ్రీరాముని పేరుతో బీజేపీ గెలిచింది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అయోధ్య శ్రీరాముని పేరు చెప్పుకొని మెదక్ ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ గెలుపు కోసం పని చేశారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ పార్టీని, ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శించే స్థాయి రఘునందన్‌రావుకు లేదన్నారు. తమ పార్టీ, నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ సామూహిక అక్షరాభ్యాసం

కొమురవెల్లి(సిద్దిపేట): బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేటుకు దీటుగా ప్రీస్కూల్ నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు.

◆ మోడల్‌స్కూల్‌కు బస్సు నడపాలి

నంగునూరు(సిద్దిపేట): ఆర్టీసీ బస్సులు నడపకపోవడంతో మోడల్ స్కూల్ విద్యార్థులు పాఠశాలలకు రావడంలేదని బీఆర్‌ఎస్ నాయకుడు ఎడ్ల సోమిరెడ్డి అన్నారు. శనివారం అక్కేనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి సిద్దిపేట ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంగునూరు మండలంలోని అన్ని గ్రామాల నుంచి 300 మంది విద్యార్థులు బస్సులో మోడల్ స్కూల్‌కు వస్తారన్నారు. మూడు రోజుల కిందట పాఠశాలలు ప్రారంభం కాగా బస్సులు లేక కేవలం 50 మంది మాత్రమే హాజరవుతున్నారన్నారు. అధికారులు స్పందించి గతంలో నడిపిన విధంగా బస్సులు పునరుద్ధరించాలన్నారు.

◆ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

హుస్నాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు.

◆ ఎమ్మెల్యేకు ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె భువనేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 24 నుంచి 26 వరకు జరిగే రాజశ్యామల సహిత మహారుద్ర పురస్సర శతచండీ హోమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి హాజరు కావాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ఎమ్మెల్యేని ఆహ్వానించిన వారిలో మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సూకూరి లింగం ఉన్నారు.

◆ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కోహెడ(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొక్కుల కీర్తి అన్నారు. శనివారం రైతు వేదిక కార్యాలయంలో మండలంలోని 106 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేసి మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేవిధంగా అధికారులు, పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ, ఆర్ఐ సురేందర్ పాల్గొన్నారు.